క్లుప్తంగా

ట్రాన్స్‌కో ఏఈగా అనిల్‌కుమార్



అనిల్‌కుమార్‌ను సత్కరిస్తున్న సిబ్బంది

మనుబోలు : మనుబోలు మండల ట్రాన్స్‌కో ఏఈగా పి.అనిల్‌కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. నెల్లూరు టౌన్‌లో ఏఈగా పనిచేస్తూ బదిలీపై మనుబోలు ట్రాన్స్‌కో కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్‌ను సిబ్బంది సత్కరించారు. గతంలో ఇక్కడ ఏఈగా ఉన్న రవికుమార్‌రెడ్డి బదిలీపై వెళ్లడంతో కార్యాలయంలో జూనియర్ ఇంజినీర్‌గా ఉన్న నాగార్జున ఇన్‌చార్జి ఏఈగా వ్యవహరిస్తున్నారు.

చైతన్య యాదవ్‌కు సేవా పురస్కారం



మనుబోలు : మండలంలోని పిడూరుపాళెం గ్రామంలో ఉన్న ఉజ్వల ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ప్రిన్సిపల్ చైతన్యయాదవ్‌కు ఉత్తమ సేవా పురస్కారం వరించింది. డాక్టర్ పెళ్లకూరు రవీంద్రారెడ్డి 28వ స్మారక దినోత్సవం సందర్భంగా ఆదివారం రాత్రి నెల్లూరు టౌన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో చైతన్య యాదవ్‌కు నిర్వాహకులు అవార్డును అందజేశారు. దీంతో సోమవారం ఆయన్ను పాఠశాల కరస్పాండెంట్ ప్రభాకర్ రెడ్డి, విద్యార్థులు అభినందించారు.

జిల్లాస్థాయి పోటీలకు మనుబోలు విద్యార్థులు

మనుబోలు : మనుబోలుకు చెందిన ఇద్దరు విద్యార్థులు జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. మనుబోలులోని శుశృత ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులైన గుంజి అఖిల్, చిలకూరు గౌతమ్‌లు ఈనెల 20వ తేదీ మనుబోలులో జరిగిన మండల స్థాయి వాలీబాల్ పోటీల్లో సత్తాచాటి నియోజకవర్గ స్థాయికి ఎంపికయ్యారు. పొదలకూరులో సోమవారం జరిగిన నియోజకవర్గ స్థాయి పోటీల్లో సత్తాచాటి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. దీంతో పాఠశాల కరస్పాండెంట్ విజయభాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపల్ ఫరీద్‌లు విద్యార్థులను అభినందించారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పట్టణంలోని గోపాల కృష్ణ పాఠశాలలో ఇద్దరు విద్యార్థుల చదువులకు బెస్ట్‌ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు సోమవారం రూ.18,000 ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న విశ్రాంత ఐఏఎస్ పరశురాం మాట్లాడుతూ దివంగత ఐఏఎస్ సుబ్రహ్మణ్యం ఆశయ సాధనతో బెస్ట్‌ఫ్రెండ్స్ అసోసియేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

చెరువు ఆక్రమణపై సర్వే



సర్వేను పరిశీలిస్తున్న సర్పంచ్ మల్లికార్జున

విడవలూరు : మండలంలోని వరిణి పంచాయతీ మన్నేగుంట చెరువు ఆక్రమణకు గురైందని వచ్చిన ఫిర్యాదులపై వైఎస్సార్‌సీపీ సర్పంచ్ రావెళ్ల మల్లికార్జున సోమవారం సర్వే చేయించారు. ఈ సందర్భంగా చెరువు చుట్టూ హద్దు రాళ్లను నాటించారు.

సీహెచ్‌సీలో ఆరోగ్య శిబిరం



సఫాయిమిత్రలతో వైద్యాధికారులు

పొదలకూరు : స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా స్థానిక సీహెచ్‌సీలో సఫాయిమిత్ర–ఆరోగ్య భద్రత కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో స్వీపర్ల కుటుంబాల కోసం ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేయించారు. వారికి పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ సెక్రటరీలు, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులకు చిక్కితే తుక్కే..



కొడవలూరులో పాఠశాల వ్యాన్‌లు చుట్టూ అల్లుకుపోయిన తీగలు



కోవూరులో తుప్పు పట్టిపోయిన వాహనాలు

ఏదైనా కేసులో పోలీస్‌స్టేషన్‌కు వాహనాలు చేరితే సంవత్సరాల తరబడి అలాగే ఉండిపోయి తుక్కు తుక్కుగా మారిపోతున్నాయి. ఎంతో విలువైన వాహనాలు ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి. రూ.లక్షలు విలువ చేసే ప్రజాధనం తుప్పు పట్టి నిరుపయోగమవుతోంది. నియోజకవర్గంలోని అన్ని పోలీస్‌స్టేషన్‌లలో ఇదే పరిస్థితి నెలకొంది.

- పోలీస్‌స్టేషన్‌లలో పేరుకుపోతున్న వాహనాలు
- ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ..
- మట్టిలో కలుస్తున్న ప్రజాధనం

కొడవలూరు : ప్రమాదాలు జరిగినా, పత్రాలు లేకుండా నడిపినా, గంజాయి లాంటి నిషేధిత మత్తు పదార్థాలు, ఎర్ర చందనం తరలిస్తూ.. ఇలా పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలు పోలీస్‌స్టేషన్‌లకు చేరుతాయి. ఇలా వచ్చే వాహనాలు కేసులు పరిష్కారం కాకనో లేక కేసులో పట్టుబడిన వాటిపై యజమాని ఆసక్తి చూపకపోవడమో తదితర కారణాలతో సంవత్సరాలు తరబడి అక్కడే ఉండిపోతున్నాయి. ఎంతో విలువైన ఈ వాహనాలు ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ తుప్పు పట్టి ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి. నియోజకవర్గంలోని అన్ని పోలీస్‌స్టేషన్‌లలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. కొని పోలీస్‌స్టేషన్‌లలో వీటిని ఉంచేందుకు స్థలం లేక స్టేషన్‌కు సమీపంలో ఎక్కడైనా ఖాళీ ప్రదేశంలో పెట్టేస్తున్నారు. ఆ తరువాత వాటి గురించి పట్టించుకోవడం లేదు. అలా పెట్టిన వాహనాల్లో ఉపయోగపడే వస్తువులన్నీ మాయమవుతున్నాయి.

ఇంటి దొంగల పనేనా

వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను స్టేషన్‌కు తీసుకొస్తే ఆ వాహనాలకు సంబంధించిన టైర్‌లు, ఇంజిన్, బ్యాటరీ, స్పీకర్ బాక్స్‌లు తదితర ఇతర వాహనాలకు ఉపయోగపడే విలువైన వస్తువులు ఒకట్రెండు రోజుల్లోనే మాయం చేస్తున్నారు. ఒక వేళ త్వరితగతిన కేసులు పరిష్కారమైనా వాహనంలో విలువైన వస్తువులు చోరీకి గురై ఉండడంతో యజమానులు వాటిని తీసుకుపోయేందుకు ఆసక్తి చూపడం లేదు. ఇది ఇంటి దొంగల పనేనా అన్న అనుమానాలు కూడా ప్రజల్లో బలంగా ఉన్నాయి. సంవత్సరాలుగా కేసులు పరిష్కారం కాని వాహనాలు తుప్పు పట్టి ఉండడంతో యజమాని వాటిని తీసుకుపోయేందుకు ఆసక్తి చూపడం లేదు. తనపై ఉన్న కేసు పరిష్కారమైంది చాలని భావించి మరో వాహనం కొనుగోలు చేస్తున్నారే తప్ప పాత వాహనాన్ని తీసుకుపోవడం లేదు. దీంతో ఏడాదికేడాది వాహనాల సంఖ్య గణనీయంగా పెరుగుతుండడంతో పాటు అవి తుప్పు పట్టి ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి. కొడవలూరు, కోవూరు, విడవలూరు తదితర పోలీస్‌స్టేషన్లలోనైతే విలువైన వ్యాన్‌లు, కార్లు సైతం తుప్పు పట్టి చెట్లు అల్లుకుపోయి ఉన్నాయి. పోలీస్‌స్టేషన్‌ల వద్ద రూ.లక్షలు విలువ చేసే ప్రజా ధనం మట్టిలో కలిసిపోతోంది.

వేలంపాటతో ప్రభుత్వానికి రాబడి

గత ప్రభుత్వంలో పట్టుబడిన వాహనాల కేసులను త్వరితగతిన పరిష్కరించి యజమానులు తీసుకుపోకపోతే వెంటనే వేలం వేసేలా చర్యలు తీసుకున్నారు. ప్రతి మూడు నెలలకు పోలీసు, సెబ్ స్టేషన్‌లలో వేలం నిర్వహించేవారు. ఈ విధంగా చేయడం వల్ల విలువైన వాహనాలు మట్టిలో కలిసిపోకుండా ప్రభుత్వానికి రాబడి వచ్చేది. ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు. పట్టుబడిన వాహనాలను నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారు. దీనివల్ల ప్రజాధనం వృథా అవుతుందే తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండడం లేదు. వాహనాల విషయంలో ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలి. ప్రజాధనం తుప్పు పట్టిపోకుండా వాహనాలకు సంబంధించిన కేసులను త్వరితగతిన పరిష్కరించేలా నూతన చట్టం తీసుకురావాలి. ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరు కాకుండా తక్కువ వ్యవధిలోనే కేసులను పరిష్కరించి యజమానికి ఇవ్వడమో లేక వేలం వేయడమో చేయాలి. తద్వారా ప్రజాధనం వృథా కాకుండా కాపాడొచ్చు.



కోవూరులో పనికి రాకుండా పోయిన విలువైన వాహనాలు



కొడవలూరులో చెట్ల మధ్య ఉన్న విలువైన వాహనాలు

రెవెన్యూలో భారీగా బదిలీలు

మనుబోలు : మనుబోలు మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం భారీగా బదిలీలు చోటుచేసుకున్నాయి. రీసర్వే డీటీ శివప్రసాద్ ఇందుకూరుపేటకు, సీనియర్ అసిస్టెంట్ అమీర్‌బాషా తెలుగు గంగ కార్యాలయానికి, ఆర్ఐ సుధీర్ నెల్లూరు కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. అలాగే మండలంలోని కాగితాలపూరు వీఆర్వో బుజ్జయ్య పొదలకూరు మండలం బిరదవోలుకు, బండేపల్లి వీఆర్వో అఖిల్ ఇందుకూరుపేట మండలం పల్లిపాడుకు, గురివిందపూడి వీఆర్వో శ్రీనివాసులు పిడూరుకు, పిడూరు వీఆర్వో శీనమ్మ నెల్లూరు అర్బన్‌కు, బద్దెవోలు వీఆర్వో భగవాన్ వెంకటాచలం పూడిపర్తికి, మనుబోలు టౌన్ వీఆర్వో నాగేశ్వర రావు కట్టువపల్లికి, వెంకన్నపాళెం వీఆర్వో మురళీధర్ అక్కంపేటకు, జట్లకొండూరు వీఆర్వో నాగార్జున రెడ్డి మనుబోలు–1కు, మడమనూరు వీఆర్వో శ్రీనివాసులు మనుబోలు–2కు బదిలీ అయ్యారు.

మనుబోలు డీటీగా బషీర్



మనుబోలు మండల ఉప తహసీల్దార్‌గా ఎస్‌కే బషీర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. నెల్లూరు అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో డీటీగా పనిచేస్తూ మనుబోలుకు బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న డీటీ శ్రీకాంత్‌రెడ్డిని ఇందుకూరుపేటకు బదిలీ చేశారు.

తహసీల్దార్ సారంగపాణి బదిలీ

పొదలకూరు : తహసీల్దార్(అడహక్)గా బాధ్యతలు తీసుకున్న స్వల్ప వ్యవధిలోనే ఎం.సారంగపాణి బదిలీ అయ్యారు. ఆయన విడవలూరు డిప్యూటీ తహసీల్దార్‌గా బదిలీపై వెళ్తున్నారు. ఆయన స్థానంలో ఇప్పటి వరకు ఎవరినీ నియమించ లేదు. ఇక్కడ డీటీగా పనిచేస్తున్న శివకృష్ణకు ఎఫ్ఏసీ తహసీల్దార్‌గా బాధ్యతలు అప్పగిస్తారని తెలుస్తోంది. కాగా రీ–సర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న సాయి గణేష్‌ను తోటపల్లిగూడూరు డీటీగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో సురేఖను డిప్యూటీ తహసీల్దార్‌గా నియమించారు. ఆమె గతంలో ఇక్కడ సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి ఉన్నారు. ఇన్‌చార్జి మండల సర్వేయర్‌గా ఉన్న ఎల్.వెంకటేశ్వర్లును సైదాపురం మండల సర్వేయర్‌గా బదిలీ చేశారు. అయితే ఇక్కడ రెగ్యులర్ సర్వేయర్ ఏడీ సర్వే కార్యాలయంలో ఉండడం వల్ల వెంకటేశ్వర్లే ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారని తెలుస్తోంది. సీనియర్ అసిస్టెంట్ గౌస్‌మున్నీ నెల్లూరు ఆర్డీఓ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో కలెక్టరేట్లో ఉన్న తనూజాను ఇక్కడ నియమించారు. సివిల్‌సప్లైస్ డీటీగా ఐ.రవిని వెంకటాచలం నుంచి ఇక్కడకు బదిలీ చేశారు.

వీఆర్వోల బదిలీ

మండలంలో పనిచేస్తున్న పలువురు వీఆర్వోలు బదిలీ అయ్యారు. తోడేరు, బిరదవోలు, వావింటపర్తి వీఆర్వోలు పేరయ్య, రామయ్య, లక్ష్మీలు రాపూరు మండలానికి, దుగ్గుంట వీఆర్వో ఎస్‌కే మాలకొండయ్య ఉదయగిరి మండలానికి, తాటిపర్తి, సూరాయపాళెం వీఆర్వోలు పుల్లయ్య, రాగయ్యలు నెల్లూరు రూరల్ మండలానికి, పొదలకూరు టౌన్ వీఆర్వోలు శ్రీహరి, ఉషాలావణ్య వెంకటాచలం, నెల్లూరు సిటీకి, వావింటపర్తి వీఆర్వో సంధ్యా ఇందుకూరుపేట మండలానికి, ఆర్‌వైపాళెం వీఆర్వో సునీత నెల్లూరు సిటీకి బదిలీ అయ్యారు.

కాకాణికి అభినందనల వెల్లువ



కాకాణికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నేతలు



పుష్పగుచ్ఛం ఇస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

మనుబోలు/ నెల్లూరు(బారకాసు) : వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులై నెల్లూరుకు విచ్చేసిన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి పలువురు అభినందనలు తెలియజేశారు. నగరంలోని డైకస్ రోడ్డులో ఉన్న ఆయన నివాసంలో సోమవారం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. మనుబోలు ఉప సర్పంచ్ కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం కాకాణిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

రొయ్యల సాగుపై క్షేత్ర సందర్శన



విడవలూరు : స్థానిక పీఆర్ఆర్–వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని విద్యార్థులు సోమవారం రొయ్యల సాగుపై క్షేత్ర సందర్శన చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ బి.సుజాత తెలియజేశారు. మండల పరిధిలోని పార్లపల్లి, మోడేగుంట, మానేగుంటపాడు, చెర్లోపాళెంలో రొయ్యలసాగు క్షేత్రాలను విద్యార్థులు సందర్శించారు. రొయ్యల ఎగుమతులు, వాటికి వచ్చే జబ్బులు, అయ్యే ఖర్చులు తదితర విషయాల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఏవీ ప్రసాద్, ఎంవీ రమణారావు, పి.ప్రియాంక పాల్గొన్నారు.

ఆక్రమించిన స్థలాలను ఖాళీ చేయాల్సిందే



రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలో ఆక్రమిత ప్రభుత్వ స్థలాలను ఖాళీ చేయాల్సిందేనని కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. పట్టణంలో పలువురు ఆక్రమించిన స్థలాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ స్థలాలను వదిలి వెళ్లకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

తోటపల్లిగూడూరు : మండలంలోని చెన్నపల్లిపాళెం ఉన్నత పాఠశాలలో గుర్రం జాషువా, బోయి భీమన్నల జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ క్రమంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా సామాజిక సమరసత అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మాట్లాడారు. గుర్రం జాషువా, బోయి భీమన్నల సేవలను గుర్తుచేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సాయిప్రసాద్, ఉపాధ్యాయులు విద్యాధరి, ఫణికుమార్, వాణి, పద్మజ, విజయలక్ష్మి, నళిని, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఠాగూర్ పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య అందిస్తున్నాం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపల్ సత్యనారాయణ

ముత్తుకూరు : విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను బోధిస్తున్నామని అదానీ వరల్డ్ స్కూల్ ప్రిన్సిపల్ సత్యనారాయణ అన్నారు. కృష్ణపట్నంలోని పాఠశాలలో సోమవారం జరిగిన గ్రాండ్ పేరెంట్స్ డేలో ఆయన పాల్గొని, ప్రసంగించారు. బంధువులు, బంధుత్వాలు చాలా విలువైనవని, వీటిని ఎట్టి పరిస్థితిలో విస్మరించవద్దని చెప్పారు. ఈ సందర్భంగా పిల్లలచే తాత, నానమ్మ, అమ్మమ్మలకు పాదపూజ చేయించి, ఆశీస్సులు అందించే కార్యక్రమం జరిపారు. స్కూల్ కో–ఆర్డినేటర్ ఉష సునీత, శ్రీవాణి, మౌనిక, అకడమిక్ హెడ్ రాబిన్ పాల్గొన్నారు.

నేటి నుంచి పొలం పిలుస్తోంది



మాట్లాడుతున్న ఏఓ జహీర్

మనుబోలు : మండలంలోని అన్ని పంచాయతీల్లో ఈనెల 24వ తేదీ నుంచి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తామని మండల వ్యవసాయాధికారి షేక్ జహీర్ తెలిపారు. ఆయన తన కార్యాలయంలో సోమవారం మాట్లాడుతూ ప్రతి మంగళ, బుధవారాల్లో ఈ కార్యక్రమాన్ని పంచాయతీల వారీగా నిర్వహిస్తామని తెలిపారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రైతులకు నూతన సాంకేతిక పద్ధతులను తెలియజేస్తామన్నారు. చీడపీడల నుంచి నివారణ, సహజ సిద్ధ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అనుబంధ శాఖల అధికారులు కూడా పాల్గొని క్షేత్ర స్థాయిలో వ్యవసాయ పొలాలను సందర్శించి రైతులకు సలహాలు, సూచనలు ఇస్తారని తెలియజేశారు. కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

- **తోటపల్లిగూడూరు :** మండల పరిధిలో పొలం పిలుస్తోంది గ్రామసభలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నట్లు మండల వ్యవసాయాధికారి శిరీషారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24న నరుకూరు, పేడూరు, 25న మాచర్లవారిపాళెం, వరకవిపూడి, అక్టోబర్ 1న వరిగొండ-1, వరిగొండ-2, 3న పోట్లపూడి, వెంకన్నపాళెం, 8న చిన్నచెరుకూరు, ఇస్కపాళెం, 9న కోడూరు-1, కోడూరు-2 గ్రామ సచివాలయాల్లో గ్రామసభలు జరుగుతాయన్నారు. అలాగే అక్టోబర్ 15న సౌత్‌ఆములూరు, ముంగళదొరువు, 16న టీపీ గూడూరు-1, ఈదూరు, 22న మాచర్లవారిపాళెం, వరకవిపూడి గ్రామ సచివాలయాల్లో గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. అక్టోబర్ 23 నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు మలి విడత పొలం పిలుస్తోంది గ్రామ సభలు అన్ని గ్రామాల్లో జరుగుతాయన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉత్సాహంగా నియోజకవర్గ స్థాయి పోటీలు



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ నగేష్‌కుమారి

పొదలకూరు : సర్వేపల్లి నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీల ఎంపికలను స్థానిక డీఎన్నార్ జెడ్పీ బాయ్స్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో సోమవారం నిర్వహించారు. మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. తొలుత ఈ పోటీలను ఎంపీడీఓ టి.నగేష్‌కుమారి ప్రారంభించారు. అన్ని పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడాకారులను తీసుకొచ్చారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల క్రీడాకారులు ఎంపికల్లో పాల్గొంటారని ఏజీఎఫ్ కో–ఆర్డినేటర్ విజయ్‌విశ్వేశ్వరన్ తెలిపారు. మూడు రోజుల పాటు ఇక్కడ క్రీడాపోటీల ఎంపికలను నిర్వహించనున్నారు. తొలిరోజున వాలీబాల్, కబడ్డీ, చెస్, అండర్–14, 17 బాల, బాలికలకు నిర్వహించారు. రెండోరోజున మంగళవారం బ్యాడ్మింటన్, యోగా, చివరి రోజు బుధవారం అథ్లెటిక్స్‌కు పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో మహ్మదాపురం, పొదలకూరు హెచ్‌ఎంలు సీహెచ్ రామకృష్ణ, కె.సనత్‌కుమార్ పాల్గొన్నారు.

హిందీ పాఠ్యాంశంపై లఘు చిత్రం



నటీనటులైన విద్యార్థులతో హెచ్‌ఎం శ్రీనివాసరావు, నాగభూషణం

కొడవలూరు : మండలంలోని గండవరం హైస్కూల్ హిందీ పండిట్ జి.నాగభూషణం తొమ్మిదో తరగతిలోని హిందీ పాఠ్యాంశాన్ని లఘు చిత్రం(షార్ట్ ఫిల్మ్)గా నిర్మిస్తున్నారు. తొమ్మిదో తరగతిలోని హిందీ పాఠ్య పుస్తకంలో 'తుమ్ కబ్ జావోగే అతిథి' (ఓ అతిథి నీవు ఎప్పుడు వెళ్తావు) అనే పాఠ్యాంశం ఉంది. దీనిని విద్యార్థులే నటీనటులుగా హాస్య భరిత లఘు చిత్రంగా హిందీ పండిట్ నాగభూషణం నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించి పాఠశాలలో విద్యార్థులతో సోమవారం చిత్రీకరణ చేశారు. ఈ సందర్భంగా నిర్మాణకర్త నాగభూషణం మాట్లాడుతూ హిందీ, తెలుగు భాషల్లో లఘు చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు తెలిపారు. దీని వల్ల విద్యార్థులు సులువుగా పాఠ్యాంశాన్ని అర్థం చేసుకోవడంతో పాటు ప్రస్తుత సమాజంలో అతిథి ఎలా ఉండాలి! అతిథిని ఎలా గౌరవించాలనే సందేశాన్ని ఇస్తుందన్నారు. ఈ లఘు చిత్రాన్ని ఆన్‌లైన్‌లోనూ అందుబాటులో ఉంచడం ద్వారా ఎక్కువ మంది విద్యార్థులకు ఉపయోగపడేలా చేయడం లక్ష్యమన్నారు. ఈ చిత్రంలో పాఠశాల విద్యార్థులు జ్ఞాన సుజన్, నాయబ్ రసూల్, జోయల్, శరణ్య, వర్షిణి, ప్రియ నటించారని తెలిపారు. వచ్చే నెల మొదటి వారంలో విద్యార్థులకు అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కందలపాడులో ఉచిత పశువైద్య శిబిరం

వెంకటాచలం : మండలంలోని కందలపాడు గ్రామంలో మండవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో కసుపూరు పశు వైద్యాధికారిణి డాక్టర్ ఎస్.సుష్మ, మండవ ఫౌండేషన్ వైద్యుడు డాక్టర్ శ్రీనివాసులు నాయుడు గేదెలకు వైద్య పరీక్షలు చేశారు. ఎదకురాని, తిరగకట్టే గేదెలకు గర్భకోశ పరీక్షలు నిర్వహించి, మందులను ఉచితంగా పంపిణీ చేశారు. 150 దూడలకు నట్టల నివారణ మందులు తాగించారు. కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం పశు వైద్య సహాయకులు నితీషా, మౌనిక, గోపి, ప్రదీప్, సుధీర్, గోపాలమిత్రలు జి.రాము, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బదిలీ

పొదలకూరు : ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.కసనానాయక్ మనుబోలుకు బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో కొడవలూరు మండలం నుంచి రమేష్ బదిలీపై వస్తున్నారు. నెలాఖరు వరకు ఏఈలు వారి స్థానాల్లో ఉంటారని తెలిసింది. పీఆర్ ఏఈ ప్రసాద్ క్వాలిటీ కంట్రోల్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కసుపర్తి సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ పవన్‌ను నియమించే అవకాశం ఉందని తెలిసింది. హౌసింగ్ ఏఈ శివమోహన్ వెంకటాచలానికి బదిలీ అయ్యారు. అయితే పొదలకూరు హౌసింగ్ ఏఈగా ఎవరినీ నియమించకపోవడంతో బదిలీ అయిన శివమోహన్ ఇన్‌చార్జిగా కొనసాగే అవకాశం ఉందని తెలుస్తోంది.

158 మందికి కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

కొడవలూరు : స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా నిర్వహిస్తున్న ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నాలుగో రోజైన సోమవారం కూడా కొనసాగాయి. మండలంలోని నాయుడుపాళెం, బొడ్డువారిపాళెం, కమ్మపాళెం, పెయ్యలపాళెం, నార్తురాజుపాళెం గ్రామాల వారికి చేశారు. నాయుడుపాళెం గ్రామం నుంచి స్థానిక నాయకుడు మాగుంట సతీష్‌రెడ్డి ప్రత్యేకంగా ఆటోల్లో 98 మంది గ్రామస్తులను తీసుకొచ్చి స్క్రీనింగ్ పరీక్షలు చేయించారు. మిగిలిన నాలుగు గ్రామాల నుంచి 60 మంది స్వచ్ఛందంగా వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో కేన్సర్ వైద్య నిపుణురాలు డి.పద్మావతి, పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.రామకృష్ణ, హెచ్‌ఎస్ వి.రామ్మోహన్, హెచ్‌ఏలు వెంకట్రావు, షఫీ ఉద్దీన్‌లు పాల్గొన్నారు.

ఎస్సైను కలిసిన నాయకులు

విడవలూరు : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై పి.నరేష్‌ను తుమ్మగుంట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు శశికుమార్, అంకయ్య తదితరులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువతో సత్కరించారు.